క్లుప్తంగా

ఆశా వర్కర్‌కు పరామర్శ

కేవీబీపురం: మండలంలోని ఓళ్లూరు సచివాలయ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఆశా వర్కర్ శోభారాణి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. శనివారం ఈ మేరకు సీఐటీయూ జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు కవిత, ప్రధాన కార్యదర్శి లక్ష్మి తదితరులు ఆస్పత్రికి వెళ్లి శోభారాణిని పరామర్శించారు.

ఉపాధ్యాయుల నిరసన

తొట్టంబేడు: ఉపాధ్యాయుల బదిలీల్లో వెబ్ కౌన్సిలింగ్‌ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వారు శనివారం స్థానిక ఎమ్మార్సీ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల నేతలతో చర్చించినట్టు ఎస్జీటీ టీచర్లకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. వెబ్ కౌన్సిలింగ్‌ను రద్దు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏపీటీఎఫ్ నాయకులు మురళీకృష్ణ, జి.శ్రీనివాసులు, ఎ.మోహన్ బాబు, దేవేంద్ర, సుబ్రహ్మణ్యంరెడ్డి, శివ, రామదాసు, సుబ్బయ్య, బి.విజయ పాల్గొన్నారు.

రేణిగుంట రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



రేణిగుంట: రేణిగుంట రైల్వే స్టేషన్‌లో శనివారం ప్రత్యేక తనిఖీలు చేసినట్టు ఆర్పీఎఫ్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాలు, ఇతర అనుమానాస్పద పదార్థాల రవాణాను అరికట్టేందుకు డాగ్ స్క్వాడ్‌తో బుకింగ్ ఆఫీస్, పార్సిల్ ఆఫీస్, ప్లాట్ ఫామ్స్, రైళ్లలో తనిఖీలు చేసినట్టు వివరించారు. కిటికీల దగ్గర కూర్చున్న మహిళలు తమ మెడలోని బంగారు వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, ఏదైనా ఆపద కలిగినా రైల్వే హెల్ప్‌లైన్ 139కి కాల్‌చేయాలన్నారు. ఆర్పీఎఫ్ ఎస్ఐ శ్రీనిష్, జీఆర్పీ ఎస్ఐ రవి పాల్గొన్నారు.



రైలు బోగీలో తనిఖీలు చేస్తున్న రైల్వే పోలీసులు

రేషన్.. మహిళల పరేషాన్!

కేవీబీపురం: రేషన్ సరుకులు తీసుకునేందుకు మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా కళత్తూరు పంచాయతీ పరిధిలోని కస్తూరిపురం, కొట్టాలమిట్ట గిరిజనులు సుమారు 3 కిలోమీటర్లు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి ముంగిటకే సరుకులు వచ్చేవని, ఇప్పుడు చౌక దుకాణం ముందు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండుటెండలో గ్రామానికి దూరంగా ఉన్న రేషన్ షాపుకు వెళ్లి రావాలంటే చాలా ఇబ్బందిగా ఉందని వెల్లడిస్తున్నారు. ఇదే అదునుగా సరుకులను మోసుకుని తీసుకెళ్లలేని వారిని అక్రమార్కులు టార్గెట్ చేస్తున్నారు. బియ్యం తమకు అమ్మేసి వెళ్లాలని బలవంతం చేస్తున్నారు. దీంతో పలువురు వారి ఒత్తిడికి తలొగ్గి త్రుణమో పణమో తీసుకుని బియ్యం అప్పగించేస్తున్నారు. ఇక అక్రమార్కులు పట్టపగలే ఆటోలు, ఇతర వాహనాల్లో రేషన్ బియ్యం బస్తాలను తరలించేస్తున్నారు.



రేషన్ బియ్యం తెచ్చుకుంటున్న కస్తూరిపురం గిరిజనులు



ఆటోలో తరలిపోతున్న రేషన్ బియ్యం

పట్టా భూమిలో ఇసుక తవ్వకాల అడ్డగింత

రేణిగుంట: మండలంలోని స్వర్ణముఖి నది నుంచి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరిపి రాష్ట్రాలు దాటిస్తున్నా జనసేన నేతలు పట్టించుకోవడం లేదు. ప్రైవేట్ పట్టా భూమిలో ఇసుక తవ్వకాలను మాత్రం అడ్డుకుని హంగామా చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాజులమండ్యం హరిజనవాడ సమీపంలోని రైతు పట్టా భూమిలో శనివారం ఇసుక తవ్వకాలు తవ్వి ట్రాక్టర్‌లో లోడు చేస్తుండగా జనసేన రేణిగుంట మండల అధ్యక్షుడు చిన్నతోటి నాగరాజు హరిజనవాడకు చెందిన కొందరు యువకులను వెంటబెట్టుకుని అక్కడికి చేరుకున్నారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పట్టా భూమి అని, తాము రైతు నుంచి కొనుగోలు చేసి తవ్వకాలు చేస్తున్నట్టు చెప్పినా వినలేదు. ట్రాక్టర్లను అడ్డుకుని నిరసన తెలిపారు. స్వర్ణముఖి నది నుంచి నిత్యమూ వందల ట్రాక్టర్లు, ట్రక్కులతో చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్నా పట్టించుకోకుండా జనసేన నాయకులు ఇలా వ్యవహరించడం తగదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని, కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ శ్రీదేవి హెచ్చరించారు. కనమనంబేడు గ్రామ రెవెన్యూ సర్వే నెంబరు 352లోని భూమిని కొందరు ఆక్రమించి, గుడిసెలను వేశారు. శనివారం ఈ మేరకు తహసీల్దార్ తమ సిబ్బందితో కలిసి వెళ్లి గుడిసెలను తొలగించారు. ఈ భూమిని ప్రజా ప్రయోజనార్థం కేటాయించామని, ఇందులోకి అక్రమంగా ప్రవేశిస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. దీనిపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. గుడిసెలకు సంబంధించిన సామగ్రిని స్వాధీనం చేసుకుని కార్యాలయానికి తరలించారు.కార్యక్రమంలో డీటీ చంద్రబాబునాయుడు, ఆర్ఐ నల్లయ్య, వీఆర్‌ఓలు బాలమురళి, జగదీష్, వీఆర్‌ఏలు అనిల్, సురేష్ పాల్గొన్నారు.

దాస్ సేవలు చిరస్మరణీయం

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధికి మాజీ మంత్రి దాస్ అందించిన సేవలు చిరస్మరణీయమని డీవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజు కొనియాడారు. శనివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో దాస్ 104వ జయంతి నిర్వహించారు. ఆయన జ్ఞాపకార్థం పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, నేతలు సదానందం, శ్రీనివాసులు, చంద్రశేఖర్, మునిచంద్ర, సర్పంచ్ జ్యోతి పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన తేజ్ గణేష్, కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళం ఇచ్చారు. వారికి అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో సతీష్ మాలిక్, సూపరింటెండెంట్ నాగభూషణం, పీఆర్వో రవి తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు

రమ్యశ్రీకి ప్రతిభ అవార్డు



బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక అక్షర పబ్లిక్ స్కూల్ విద్యార్థిని రమ్యశ్రీ పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించి షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డు ఎంపికైనట్లు కరస్పాండెంట్ కొండా మునిప్రతాప్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్కూల్ ప్రారంభించిన తొలి ఏడాదిలోనే షైనింగ్‌స్టార్ ప్రతిభ అవార్డు రమ్యశ్రీకి రావడం ఆనందంగా ఉందని వెల్లడించారు.

వేడుకగా అలుగు నిలుపు ఉత్సవం

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురంలో వెలసిన శ్రీకృష్ణ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అలుగు ఊరేగింపు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అలుగును మేళతాళాల మధ్య గ్రామంలో ఊరేగించారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం ఆదివారం నిర్వహించేందుకు ఆలయ పెద్దలు ఏర్పాట్లు పూర్తి చేశారు. అగ్నిగుండంలో ప్రవేశం చేయనున్న భక్తులు ఇప్పటికే కంకణాలు ధరించారు. గట్టి బందోబస్తు చేపట్టనున్నట్టు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. పూజారి రవి పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ప్రముఖ సినీనటి వరలక్ష్మి శరత్‌కుమార్ దంపతులు వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వరలక్ష్మి శరత్‌కుమార్ దంపతులు ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. వారికి వేదపండితులు మృత్యుంజయ స్వామి సన్నిధిలో ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.



రాహుకేతు పూజలు చేయించుకుంటున్న వరలక్ష్మి శరత్‌కుమార్ దంపతులు

త్యాగానికి ప్రతీక బక్రీద్

రేణిగుంట: త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని ముస్లిం మత పెద్దలు తెలిపారు. రేణిగుంట పట్టణంలోని ముస్లింలు శనివారం బక్రీద్ పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 9 గంటలకు రైల్వే స్టేషన్ ఎదుట ఉన్న పెద్ద మసీదుకు అందరూ చేరుకున్నారు. అక్కడి నుంచి మత గురువులతో కలిసి ప్రదర్శనగా ఈద్గా మైదానానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు, బుచ్చినాయుడుకండ్రిగ, నీర్పాకోట, వెస్టు వరత్తూరు, గాజులపెళ్లూరు గ్రామాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను శనివారం జరుపుకున్నారు. ప్రత్యేకంగా ముస్తాబు చేసిన మసీదుల్లో ప్రార్థనలు చేపట్టారు. పరస్పరం ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో బక్రీద్ పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. మత గురువులు ఖురాన్ బోధించారు. వరదయ్యపాళెం మండలాల్లోని ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేసి ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.



రేణిగుంటలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నేడు పళ్లికొండేశ్వరునికి ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలో వెలసిన శ్రీపళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రదోష పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ లత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు నందీశ్వరుడు, వాల్మీకీశ్వరస్వామి, మరకదాంబిక అమ్మవారికి ఏకకాలంలో అభిషేకం, మహా హారతి చేపట్టనున్నట్లు వివరించారు. ప్రదోష పూజలో పాల్గొనేవారు రూ.500 చెల్లించాలని సూచించారు.

సీడీపీవోల బాధ్యతల స్వీకరణ

రేణిగుంట/శ్రీకాళహస్తి: రేణిగుంట , శ్రీకాళహస్తి సీడీపీవోలుగా కృష్ణవేణి, రాజేశ్వరి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కృష్ణవేణి నగరి నుంచి, రాజేశ్వరి పుంగనూరు నుంచి బదిలీపై శ్రీకాళహస్తికి వచ్చారు. శ్రీకాళహస్తిలో పనిచేస్తున్న శాంతిదుర్గ చిత్తూరు జిల్లా శాంతిపురానికి బదిలీ అయ్యారు. వారిని సిబ్బంది అభినందించారు.



కృష్ణవేణి



రాజేశ్వరి



విద్యా కేంద్రంగా శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఒక పురాతనపట్టణం. హిందు ధార్మిక పుణ్యక్షేత్రం, ఇక్కడ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అందులోభాగంగా ఏర్పేడులోని వ్యాసాశ్రామం, శ్రీకాళహస్తిలోని శుకబ్రహ్మాశ్రమం పురాతన విద్యాసంస్థలుగా చెప్పుకోవచ్చు.

శ్రీవ్యాసాశ్రమం పాఠశాల

మలయాళ స్వామి 1926లో చిత్తూరు జిల్లాలోని ఏర్పేడు దగ్గరున్న కాశీబుగ్గ వద్ద ఆశ్రమం స్థాపించారు. ఈ ఆశ్రమంలో సంస్కృత, వేద పాఠశాలలు నిర్వహిస్తున్నారు. ఇందులో కుల, మత, లింగ బేధాలు లేకుండా అందరికీ సమానంగా విద్యను అందిస్తున్నారు.

శుకబ్రహ్మ ఆశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థలు

శ్రీకాళహస్తి పట్టణంలోవున్న శ్రీ శుకబ్రహ్మాశ్రమాన్ని మలయాళ స్వామి శిష్యుడైన శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామి 1950 జనవరి 20న స్థాపించారు. దీనికి అనుబంధంగా శ్రీ విద్యాప్రకాశానంద గిరి స్వామి విరాళంతో 1966లో శ్రీకాళహస్తిలో డిగ్రీ కళాశాల స్థాపించారు. 1982లో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలను ప్రారంభించారు. ఇక్కడ ఉన్నత విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారు.

వందేళ్ల చరిత్ర గల జెడ్పీ హైస్కూల్

శ్రీకాళహస్తి పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు వంద సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడ దివంగత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, ప్రముఖ సంగీత గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం చదువుకున్నారు. అదేవిధంగా ఎంతోమంది ఇక్కడ చదివిన వారు ఉన్నత స్థానాల్లో వున్నారు. ఇక్కడ ఉన్నతమైన విద్య అందిస్తున్నారు.

తిరుపతి జిల్లాకే తలమానికం ఐఐటీ

ఏర్పేడులో వున్న తిరుపతి ఐఐటీ జిల్లాకే తలమానికం. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా ఈ సంస్థను ఇక్కడ ఏర్పాటు చేశారు. ఇది స్వయంప్రతిపత్తి కల కళాశాల. ఈ సంస్థ ప్రతిపాదిత పరిశోధనా ఉద్యానవనం సహా 539 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. భారతదేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు.

శ్రీకాహాళహస్తీశ్వరాలయ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల

1996లో శ్రీకాళహస్తి దేవాలయం ఆధ్వర్యంలో పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటుచేశారు. ఇక్కడ ఉన్నత విద్య అందించేవారు. కళాశాలలో రాజకీయాలు పెరిగి చివరకు విద్యా ప్రమాణాలు తగ్గిపోయి మూత పడింది.

శ్రీకాళహస్తి పట్టణంలో పలు విద్యాసంస్థలు

శ్రీకాళహస్తి అర్బన్, రూరల్‌లో 142 పాఠశాలలు ఉన్నాయి. 50కి పైగా ప్రైవేటు పాఠశాలలు, నాలుగు రెసిడెన్సియేల్ పాఠశాలలు, మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, రెండు డిగ్రీ కళాశాలలు వున్నాయి. అలాగే ప్రైవేట్‌లో పదికి పైగా జూనియర్ కళాశాలలు, రెండు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి.

ఇంటర్ ఫలితాల్లో విక్రమ్ కళాశాల విజయకేతనం

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో విక్రమ్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఎంపీసీ విభాగంలో ఈశ్వరి 470గాను 466 మార్కులు, చందు 464 మార్కులు, తనుజశ్రీ 464 మార్కులు, ధనుశ్రీ 464 మార్కులు, శిరీషా 462 మార్కులు, తేజశ్రీ 460, నాగవినూత్న 460 మార్కులు, ఎంఈసీ విభాగంలో దక్షి 500 మార్కులకుగాను 490 మార్కులు, సీఈసీ విభాగంలో 500 మార్కులకు గాను హలీమా 487, విజయకుమార్ 482 మార్కులు సాధించారు. వారిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, కరస్పాండెంట్ మునిలక్ష్మి అభినందించారు.